క్లుప్తంగా

మత్తడి పారుతున్న డబ్బవాగు



పొంగి ప్రవహిస్తున్న వాగు

మునిపల్లి(అందోల్): ఎడతేరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో తాటిపల్లి, పిల్లోడి, మన్‌సాన్‌పల్లి, బోడపల్లి, తక్కడపల్లి, గార్లపల్లి గ్రామ శివార్ల నుంచి డబ్బవాగు పొంగి ప్రవహిస్తోంది. శనివారం కూడా భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాకపోకలు నిలిపివేత



రోడ్డుకు అడ్డంగా కంచె ఏర్పాటు చేసిన అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జిన్నారం మున్సిపాలిటీలోని పలు చెరువులు కుంటలు పొంగిపొర్లుతున్నాయి. స్థానిక రాయని చెరువు నిండుకుండలా మారింది. దీంతో జిన్నారం జంగంపేట గ్రామాల మధ్య గల వాగు ఉప్పొంగి పారుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇరు గ్రామాలకు పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. దీంతో వాహనదారులు ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఘనంగా శతాబ్ది ఉత్సవాలు



కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

రామచంద్రాపురం(పటాన్చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మై హోం అంకురా గేటెడ్ కమ్యూనిటీలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకులు మల్లికార్జున్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవాత్ నిర్వహించారు. తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

రామచంద్రాపురం(పటాన్ చెరు): రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో, అమ్మవారి మండపాల వద్ద అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. విద్యుత్ నగర్ కాలనీలోని దేవీ నవరాత్రుల యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపం వద్ద మాజీ కౌన్సిలర్ రెడ్డి సరిత రెడ్డి ఆధ్వర్యంలో చండీ హోమం, అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రిజర్వేషన్లపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమాదేవి

జిన్నారం (పటాన్‌చెరు): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన సమావేశంలో మాట్లాడుతూ... వార్డుల వారీగా మహిళా రిజర్వేషన్ల తుది జాబితా పూర్తి చేయడం జరిగిందన్నారు. వీటికి సంబంధించిన అంశాలను రాజకీయపక్షాల నాయకులకు వివరించారు. రిజర్వేషన్ల ఆధారంగా ఎన్నికల నిర్వహణకు ఆయా పార్టీల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

లలితాత్రిపుర సుందరీ దేవిగా నల్లపోచమ్మ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారు భక్తులకు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

– నారాయణఖేడ్



నారాయణఖేడ్: లతిత త్రిపుర సుందరీదేవిగా



మునిపల్లి: బుదేరాలో లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు



సంగారెడ్డి టౌన్: సౌభాగ్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు



న్యాల్‌కల్: లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో అమ్మవారు



జహీరాబాద్ టౌన్: భవానీ మాత మందిరంలో ప్రదక్షణ చేస్తున్న భక్తులు



సంగారెడ్డి టౌన్: ధనలక్ష్మి రూపంలో వాసవీమాత

బోనస్‌తోపాటు వేతనం చెల్లించాలి



నారాయణఖేడ్: కమిషనరుకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: దసరా పండుగను పురస్కరించుకొని బోనస్‌తో పాటు మూడు నెలల నిత్యావసర సరుకులు ఇవ్వాలని ఖేడ్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్ జాగ్జీవన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులందరూ దళిత, మధ్యతరగతి నిరుపేదలని, బోనస్ చట్టాన్ని వర్తింపజేసి 20 శాతాన్ని బోనస్‌గా చెల్లించాలని కోరారు. సీఐటీయూ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేశ్, మున్సిపల్ కార్మిక సంఘం బాధ్యులు చంద్రకళ, శకుంతల, సాయమ్మ, సిద్ధమ్మ, నర్సమ్మ, రాజు, సాయిలు, రవి సుధాకర్, కార్మికులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పొంగుతున్న వాగులు



జహీరాబాద్ టౌన్: ఉధృతంగా ప్రవహిస్తున్న మల్‌చెల్మ వాగు



నారాయణఖేడ్: వంతెనపైనుంచి పొంగిపొర్లుతున్న మన్సుర్‌పూర్ వాగు

నిలిచిన రాకపోకలు

నారాయణఖేడ్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ద్రోణి ప్రభావంతో శనివారం ఉదయం నుండి నారాయణఖేడ్ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. కుండపోత వర్షం కురువడంతో రోడ్లు, పంట పొలాలు జలమయమయ్యాయి. నారాయణఖేడ్ శివార్లలోని మన్సూర్‌పూర్ వాగు పొంగి ప్రవహించడంతో నారాయణఖేడ్ నుండి కంగ్టి, సిర్గాపూర్ మండలాలు, కామారెడ్డి జిల్లా పిట్లం, తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచి పోయాయి. పోలీసులు ముందస్తుగా బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా ఖాంజీపూర్ వంతెనపై నుండి కూడా వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. హన్మంత్‌అవుపేట, మాద్వార్‌ల మధ్య వాగు పొంగి ప్రవహించడంతో ఆయా ప్రాంతాల్లోనూ రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు మొత్తం చెరువులను తలపించే విధంగా కనిపించాయి.

ముంచెత్తిన వాన

- ఇళ్లు రోడ్లపైకి వరద
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పోతిరెడ్డి పల్లి చౌరస్తా వద్ద ప్రధాన రహదారి పై పారుతున్న వర్షపు నీరు

సంగారెడ్డి: కురుస్తున్న వర్షాలతో జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని ప్రధాన రహదారులు, గల్లీ రోడ్లు, వాగులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు పలు కాలనీలు నీటిలో మునిగిపోయాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వరద తీవ్రత మరింత పెరిగింది. వరద చేరుకున్న కాలనీలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. జేసీబీలతో రోడ్డును తవ్వి వరదను బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో కూరగాయల దుకాణాలు నీట మునిగాయి. దీంతో రూ.వేలల్లో నష్టం వాటిల్లిందని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి పట్టణంలోని జాతీయరహదారిపై కాలువలు పొంగి పొర్లడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డి చౌరస్తా నుంచి రైతు వేదిక వరకు, చౌరస్తా నుంచి మినిస్టర్ రోడ్డు వరకు నీరు రోడ్లపై నిలవడంతో గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం మేలుకొని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీట మునిగిన పంటలు

- ఆందోళనలో రైతన్నలు



హత్నూరలో నీట మునిగిన పంటలు

హత్నూర (సంగారెడ్డి): భారీ వర్షంతో పాటు సింగూరు గేట్లు తెరవడంతో మంజీరా ఉగ్రరూపం దాల్చింది. దీంతో పంట పొలాలను ముంచేసింది. హత్నూర మండలం మంజీరా పరివాహక ప్రాంతమైన రెడ్డి ఖానాపూర్ కాసాల నవాబుపేట పన్యాల కొన్యాల చీకు మద్దూర్ లింగాపూర్ గ్రామాల శివారులలోని వరి పత్తి పంటల్లోకి మంజీరా నీరు పెద్ద ఎత్తున చేరడంతో పంటలు నీట మునిగాయి. కొన్ని రోజుల క్రితం కూడా మంజీరా నీరు పంట చేనులోకి చేరి పంటలు ఆరకముందే తిరిగి నీరు చేరడంతో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి పంట నష్టపరిహారాన్ని అందించేందుకు అధికారులు సర్వే చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

అలుగు పారుతున్న చెరువులు



ఉధృతంగా పారుతున్న కంది చిమ్నపూర్ పాత చెరువు అలుగు

కంది(సంగారెడ్డి): రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు నిండి పోయి అలుగు పారుతున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి కురిసిన భారీవర్షానికి పలుచోట్ల పంట పొలాల్లో నీరు చేరి పంటలు మునిగిపోయాయి. కందిలోని కిసాన్ సాగర్ చెరువు, దేవుని చెరువు, పడిగోని కుంట చెరువు, కంది చిమ్నపూర్ పాత చెరువు, ఎర్దనూర్ అలీ సాగర్ చెరువు నిండి అలుగు పారుతున్నాయి. కాశీపూర్లో ఓ ఇంటి గోడలు కూలి పోయాయి.



కాశిపూర్ లో కూలిన ఇల్లు

వరద సమస్యకు శాశ్వత పరిష్కారం

కాంగ్రెస్ నేత నీలం మధు



కాలనీవాసులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో వరద నీటితో ముంపునకు గురవుతున్న పలు కాలనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. శనివారం చిట్కుల్‌లోని ముంపు కాలనీలలో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు కాలనీ వాసులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. గత మూడేండ్లుగా వరద ముంపునకు గురవుతూ వర్ష కాలం వస్తుందంటే తీవ్ర భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కాలనీవాసుల సమస్య విన్న నీలం మధు త్వరలో యుద్ధ ప్రతిపాదికన సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు, ప్రజా సమస్యలకు సంబంధించి తన సంపూర్ణ సహకారం ఉంటుందని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా చిట్కుల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం



ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం (పటాన్ చెరు): మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన టెక్నాలజీపై విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకుసాగుతుందని కార్పొరేటర్ పుష్ప అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక మిషన్లపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ మల్లేష్, నగేష్ పాల్గొన్నారు.





జహీరాబాద్ టౌన్: కొండ బాపూజీకి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం అధ్యక్షుడు జనార్దన్

ఖేడ్‌లో కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతి



నారాయణఖేడ్: నివాళులు అర్పిస్తున్న పద్మశాలి సంఘ బాధ్యులు

నారాయణఖేడ్: తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శనివారం ఖేడ్ పద్మశాలిభవన్‌లో స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పద్మశాలి సంఘ బాధ్యులు, పెద్దలు బసెట్టి, అనంతం, నర్సింహులు, గోస్కి శ్రీనివాస్, శివకుమార్, సతీశ్, బాయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ జయంతి

సంగారెడ్డి జోన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని శనివారం వేడుకలను నిర్వహించారు. అదనపు ఎస్పీ రఘునందన్‌రావు హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ సంబరాల్లో కమిషనర్ తిరుపతి, మహిళలు



బతుకమ్మ సంబురాల్లో జడ్జి భవానీచంద్ర, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్, అదనపు కలెక్టర్లు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం, బొల్లారం పట్టణాల పరిధిలో అధికార యంత్రాంగం బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బతుకమ్మ సంబరాలను కమిషనర్ తిరుపతి, కిషన్ ప్రారంభించారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను అలంకరించి మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా ఉద్యోగులు, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో నర్సింలు, మేనేజర్ మల్లికార్జున స్వామి, వార్డు ఆఫీసర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యాలయ ఉద్యోగులు మాణిక్యం, మల్లికార్జున్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు



జహీరాబాద్ టౌన్: మహిళలతో కలిసి బతుకమ్మ వద్ద ఆడిపాడుతున్న జడ్జి కవితాదేవి

సంగారెడ్డి జోన్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు అంగరంగవైభవంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించిన వేడుకలకు జిల్లా జడ్జి భవానీచంద్ర, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధూరి హాజరై బతుకమ్మ ఆడారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆలయానికి టీవీ బహూకరణ

నారాయణఖేడ్: మనూరు మండలంలోని బోరంచ నల్లపోచమ్మ ఆలయానికి కంగ్టి మండలం భీంరా గ్రామానికి చెందిన వెంకలే పుండ్లిక్, వెంకలే లక్ష్మి దంపతులు టీవీని బహూకరించారు. ఆలయంలో టీవీ ఏర్పాటు కోసం ఆలయ పూజారులకు అందించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

కంగ్టి(నారాయణఖేడ్): సెలవుల్లో పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులకు ఎస్ఐ దుర్గారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కంగ్టిలో ఎస్ఐ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు విరివిగా కురుస్తుండడంతో చెరువులు, కుంటల్లో పిల్లలు ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బతుకమ్మలు పారుతున్న నీటిలో వదులుతుండగా మహిళలు, యువతులు లోనికి వెళ్లకుండా జాగ్రత్త పడాలన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపినా చర్యలు తప్పవన్నారు.

◆ చీరల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దసరా సందర్భంగా ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో ఆశ కార్యకర్తలకు చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా సందర్భంగా మున్సిపల్ పరిధిలో పలు రంగాల్లో పని చేస్తున్న మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

◆ ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు



సదాశివపేట(సంగారెడ్డి): స్వాతంత్ర్య సమరయోధుడిగా చరిత్రలో నిలిచిపోయిన అమరవీరుడు భగత్‌సింగ్ 118వ జయంతి వేడుకలు శనివారం పట్టణంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి అనిల్ పట్టణ నాయకులతో కలసి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, వినయ్, మల్లేశం, రాజు, బాను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు

కంగ్టి(నారాయణఖేడ్): గ్రామపంచాయతీ వార్డు ఎన్నికల్లో మహిళలకు 50 శాతం సీట్లు లాటరీ ద్వారా కేటాయించినట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో గ్రామాల్లోని అన్ని వార్డులకు మహిళలకు సీట్లు కేటాయింపు లాటరీల్లో తీశారని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

◆ ఎన్నికల కోసం పీఓలకు శిక్షణ

కంగ్టి(నారాయణఖేడ్): గ్రామపంచాయతీ ఎన్నికల కోసం అధికారులు మండలంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో శనివారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పీఓలు 60 మందికి శిక్షణ ఏర్పాటు చేయగా 56 మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి ఎంఈఓ రహీమోద్దిన్ సమన్వయం చేయగా రవీందర్, సంగ్‌శెట్టి, కిఫాయత్‌అలీ శిక్షణ ఇచ్చారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మునిపల్లి(అందోల్): మండలంలోని హైద్లాపూర్ గ్రామానికి చెందిన తలారి శివయ్యకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును బీఆర్ఎస్ నాయకులు బక్కన్న, విఠల్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సాయికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.